అస్తవ్యస్తంగా రహదారులు

- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు
- గ్రామాలకు వెళ్లాలంటే నరకమే

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల పరిధిలో ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మరాయి. గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావాలంటే ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడాల నుంచి తిప్పర్తి వరకు 8 కిలోమీటర్లు, వెంకటాద్రిపాలెం నుంచి ఇండ్లూరు వరకు 5 కి.మీ., గంగన్నపాలెం నుంచి తిప్పర్తి వరకు 5 కి.మీ. మేర బీటీ రోడ్లు ఉన్నాయి.. పంచాయతీరాజ్ పరిధిలో బీటీ రోడ్లు 76 కి.మీ.లు, మట్టి రోడ్లు 32 కి.మీ. ఉన్నాయి. ఈ రోడ్లు దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక రోడ్లపై తారు కొట్టుకుపోయి అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆరెగూడెం నుంచి ఎల్లమ్మగూడెం స్టేజీ వరకు 3 కి.మీ. మట్టి రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాశీవారిగూడెం నుంచి తిప్పర్తి వద్ద నార్కట్‌పల్లి- అద్దంకి రహదారికి చేరుకోవాలంటే 3 కి.మీ. ప్రయాణం చేయాల్సి ఉంటుంది. గుంతలు పడిన ఈ రోడ్డు గుండా వెళ్తూ అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన కంకణాలపల్లికి వెళ్లే బీటీ రోడ్డు

మరమ్మతులు చేయాలి



మండలంలోని బీటీ రోడ్లన్నీ తారు తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల రోడ్లపై వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నాం. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. అదేవిధంగా మట్టి రోడ్లను కూడా బీటీ రోడ్లుగా మార్చి వాహనదారులు ఇబ్బందులు తీర్చాలి. – కొత్తపల్లి రమణయ్య, మామిడాల

నరకయాతన పడుతున్నాం



నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి నుంచి కాశీవారిగూడేనికి 3 కి.మీ. దూరం చేరుకోవాలంటే మట్టి దారిలో వెళ్లాలి. దీంతో అరగంటకు పైగా సమయం పడుతోంది. అత్యవసర సమయంలో ఈ రోడ్డపై ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నాం. – షేక్ బుడెన్, కాశీవారిగూడెం

రామమందిరం నిర్మాణంతో ప్రజల కల సాకారమైంది



పానగల్ వేంకటేశ్వర దేవాలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న నూకల నరసింహారెడ్డి తదితరులు



వివేకానందనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: అయోధ్యలో రామమందిరం నిర్మాణంతో ప్రజల కల సాకారమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి అన్నారు. స్వచ్ఛ తీర్థ క్షేత్ర అభియాన్‌లో భాగంగా శనివారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్‌లో గల వేంకటేశ్వర దేవాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ఆవరణలో చెత్తాచెదారం తొలగించి శుభ్రంగా కడిగారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 22న అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం జరుగనుందని, ఆ రోజు ప్రజలందరు తమ ఇళ్లలో, దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, మీడియా ఇన్‌చార్జి పెరిక మునికుమార్, మహేష్, వెంకన్న, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీటీ కాలనీలో..

రామగిరి(నల్లగొండ): స్వచ్ఛ తీర్థ క్షేత్ర అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో వీటీ కాలనీ హనుమాన్ ఆలయం, వివేకానందనగర్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ పరిసరాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండా భవానీప్రసాద్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చర్లపల్లి గణేష్, దినేష్, తారా, శ్రీనివాస్, రావిరాల వెంకట్ పాల్గొన్నారు.

తెగుళ్లు సోకిన వరి పొలాల పరిశీలన



చిట్యాల: పెద్దకాపర్తిలో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి గిరిబాబు



కేతేపల్లి : గుడివాడలో వరి పొలాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి పురుషోత్తం

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాల పరిధిలో పలువురు రైతుల వరి పొలాలను శనివారం చిట్యాల మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వరి చేను అకారణంగా ఎండిపోతుండటానికి గల కారణాలను ఆయన రైతులకు వివరించారు. వరి పంట ఎదుగుదల లేకుంటే పాలిఫీడ్ ద్రావణాన్ని పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పంట ఎదుగుదలలో ఏమైనా ఇబ్బందులుంటే రైతు వేదికల్లో వ్యసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓలు క్రిష్ణకుమారి, మోసీస్, రైతులు ఉన్నారు.

కేతేపల్లిలో...

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామంలో వరి పొలాలను శనివారం మండల వ్యవసాయాధికారి బి. పురుషోత్తం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి నాట్లు వేసి 25 నుంచి 30 కావొస్తుండడంతో పొలాలకు కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు ఎకరాకు 4కిలోల క్లోరాటానిట్రిప్రోల్ 0.4 శాతం గుళికలను వేసుకోవాలని సూచించారు. మోతాదుకు మించి యూరియా వేయొద్దని అన్నారు. అనంతరం గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట రైతులు నగేష్, మహేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపులను మూసివేయించాలని తీర్మానం

మర్రిగూడ: గ్రామాల్లో బెల్ట్ షాపులను పూర్తిస్థాయిలో మూసివేయించాలని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపు మేరకు గ్రామాల్లో బెల్ట్ షాపులను మూసివేయించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, కొడాల వెంకటరెడ్డి, జమ్ముల వెంకటేష్‌గౌడ్, మాతంగి నవీన్, కొలుకులపల్లి జంగయ్య, సీతయాదయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఒలింపియాడ్’లో ప్రతిభ చూపిన విద్యార్థులు

నకిరేకల్: ఢిల్లీలోని సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ వారు ఇటీవల నిర్వహించిన ఎన్ఎస్ఓ, ఐఎంఓ ఒలింపియాడ్ పరీక్షల్లో నకిరేకల్‌లోని ఎస్వీఆర్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాడెంట్ బి. కన్నయ్యగౌడ్ శనివారం తెలిపారు. తమ పాఠశాల నుంచి మొత్తం 17మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించడంతో పాటు ఫైనల్ లెవల్‌కు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. మరో 40మంది సర్టిఫికెట్లు, షీల్డ్‌లు పొందినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, విజనరీ శ్రీపతిరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సుందరి శివరామకృష్ణ అభినందించారు.



ఒలింపియాడ్ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

నార్కట్‌పల్లి: కిరాణా దుకాణాల్లో కల్తీ తినుబండారాలు అమ్ముతున్నట్లు శుక్రవారం సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి శనివారం నార్కట్‌పల్లి పట్టణంలోని రెండు హోల్‌సేల్ తనిఖీ చేసి శాంపిల్స్‌ను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిరాణ దుకాణాల్లో కల్తీ తినుబండారాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నార్కట్‌పల్లి: కిరాణా దుకాణంలో ప్యాకెట్లను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి

వైన్ షాపుల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం: మండల కేంద్రంలోని ఓ మద్యం దుకాణంలో వారం రోజులుగా కాలం చెల్లిన బీర్ల అమ్మకాలపై ‘సాక్షి’ దినపత్రికలో ‘వైన్స్‌లో కాలం చెల్లిన బీర్ల అమ్మకాలు’ అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో నకిరేకల్ సర్కిల్ ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణ నేతృత్వంలో మండలంలోని శాలిగౌరారం, పెర్కకొండారం గ్రామాల్లో గల వైన్ షాపులలో శనివారం తనిఖీలు చేపట్టారు. మద్యం కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కాలం చెల్లిన బీర్ల అమ్మకాలపై వైన్ షాపుల నిర్వాహకులతో పాటు స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. కాలం చెల్లిన బీర్ల అమ్మకాలపై విచారణ జరుపుతున్నామని ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కాలం చెల్లిన మద్యంతో పాటు నకిలీ మద్యం అమ్మితే వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

క్లుప్తంగా

మైనార్టీ గురుకులంలో అడ్మిషన్లు ప్రారంభం

నల్లగొండ: నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీలో గల తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతుల్లో 2024–25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఎస్. వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ప్రకారం అడ్మిషన్లు ఇవ్వబడతాయని తెలిపారు. నాన్ మైనార్టీ విద్యార్థులను లాటరీ విధానం ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో లేదా ఎస్ఎల్ బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు www.tmreistelangana.gov.in లో వెబ్‌సైట్‌ను చూడాలని లేదా 9989924972 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

మంత్రిని కలిసిన బంజారా సంఘం నాయకులు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో బంజారా సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లా బంజారా సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, హేమానాయక్, లచ్చునాయక్, నరసింహనాయక్, నగేష్ నాయక్, అమర్‌సింగ్, నాగార్జున, రవినాయక్, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

30న బహిరంగ వేలం

నల్లగొండ: పట్టణంలోని ప్రాంతీయ నిఘా అమలు అధికారి కార్యాలయంలో గల టాటా సఫారీ వాహనానికి(ఏపీ 21 ఎన్ 0001) ఈ నెల 30వ తేదీ ఉదయం 11.30కు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వాహనం కనీస ధర రూ.లక్ష అని ఆసక్తి గలవారు ధరావత్తు సొమ్ము రూ.5వేలను ప్రాంతీయ నిఘా అమలు అధికారి పేరున డీడీ తీసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

క్రీడల్లోనూ రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న అబ్బగోని రమేష్

నల్లగొండ టూటౌన్: యువత క్రీడల్లోనూ రాణించాలని నల్లగొండ మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని అవుట్‌డోర్ స్టేడియంలో పుల్లెంల శ్రీనివాస్‌గౌడ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడా పోటీల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, సందీప్‌గౌడ్, ఖలీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మునుగోడు: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు సూచించాడు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి వెళ్లేందుకు గాను పేరు నమోదు చేసేందుకు ఆధార్ నంబర్ చెప్పాలని సైబర్ నేరగాళ్లు మెసేజ్‌లు పంపుతున్నారని, వాటిని నమ్మి క్లిక్ చేస్తే బ్యాంక్ అకౌంట్లలోని డబ్బులు మాయం చేస్తున్నారని అన్నారు. ఎవరూ అటువంటి మెసేజ్‌లను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ నంబర్లు ఎవరికీ చెప్పొద్దని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

నల్లగొండక్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన 34 మందిని శనివారం నల్లగొండ కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ బి. డానియల్ తెలిపారు. ఒకరికి ఐదు రోజులు, మరొకరికి రెండు రోజులు, మరో నలుగురికి ఒక రోజు జైలు శిక్ష, మిగిలిన 28 మందికి రూ.3వేల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

నల్లగొండ రూరల్: మాదకద్రవ్యాల నియంత్రణ ఎలా అనే అంశంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

తల్లీకుమారుడికి గాయాలు

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన యశోద, అమె కుమారుడు చరణ్ బైక్‌పై గ్రామం నుంచి బయల్దేరి ఊరి చివరకు వెళ్లగానే 5జీ నెట్‌వర్క్ పైప్‌లైన్ కోసం తీసిన గుంతలో అదుపుతప్పి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిద్దరిని స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బీమా చెక్కు అందజేత

శాలిగౌరారం: మండలంలోని గురుజాల గ్రామానికి చెందిన దుబ్బాక సుజాత(49) మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండటంతో పాటు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో నమోదై ఉంది. ఇటీవల సుజాత మృతిచెందడంతో ఆమె కుటుంబానికి రూ.2లక్షల జీవన జ్యోతి బీమా చెక్కు మంజూరు కావడంతో శనివారం బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ అందజేశారు. కార్యక్రమంలో క్యాషియర్ కోటేశ్వర రావు, బ్యాంకుమిత్ర హమీద్ పాల్గొన్నారు.

నిధుల వివరాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల: 2019లో చిట్యాల మున్సిపాలిటీగా ఏర్పాటైన నాటి నుంచి చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల వివరాలను తెలపాలంటూ సీపీఐ నాయకులు శనివారం చిట్యాల మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా, పన్నుల ద్వారా మున్సిపాలిటీకి వచ్చిన నిధులతో పాటు పాలకవర్గ సమావేశాలకు చేసిన ఖర్చు, మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసిన నిధులు, మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్ల వివరాలు తెలిపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి షరీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మండల బొల్గూరి లింగయ్య, నాయకులు దేశగాని బాలరాజు, మేకల భిక్షం, రావుల చినవెంకన్న పాల్గొన్నారు.

ఫెడరల్ బ్యాంకు ప్రారంభం

నల్లగొండ టౌన్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంకును శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, కౌన్సిలర్ బుర్రి చైతన్య, బాబా, బ్యాంకు హెడ్ జోష్ థామస్, మేనేజర్ రాంప్రసాద్, అశోక్ రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫెడరల్ బ్యాంకును ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్ తదితరులు

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



నల్లగొండ: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ భిక్షపతి



మర్రిగూడ: టీపీయూఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం నల్లగొండ పట్టణంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ బొల్లారం భిక్షపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరేకంటి వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె విష్ణు, కొమ్ము శ్రీను, ఎం. నరసింహనాయక్, అద్దంకి దేవదాస్, అద్దంకి బుచ్చిరాములు, రఘుపతి, రాసిమల్ల శేఖర్, బడుపుల శ్రావణ్, కైలాస్, పోలే లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్..

మర్రిగూడ: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, గోడ పత్రికను ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన వెంట ఎంపీడీఓ జె. వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

మర్రిగూడ: బాలికల సంరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద అన్నారు. శనివారం మర్రిగూడ మండలంలోని బట్లపల్లి, మర్రిగూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో బాలికల సంరక్షణతో పాటు ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలికలు, గ్రామ మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా మహిళలు ముందుకు సాగాలి

చండూరు: నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చండూరు మండలం కస్తాల గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్–2లో శనివారం ఆమె మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయంగా మహిళలు మరింత చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కళ్యాణి, మంగమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన ఉండాలి

కట్టంగూర్: బాలికల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారదారాణి, పద్మావతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం, ఇస్మాయిల్‌పల్లి, కట్టంగూర్ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కట్టంగూర్ హైస్కూల్‌లో బాలికలచే ప్రతిజ్ఞ చేయించి వారు మాట్లాడారు. చదువు వలన కలిగే ప్రయోజనాలు, లింగ వివక్ష, బాల్య వివాహాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, భిక్షవమ్మ, చంద్రకళ, మంగమ్మ, లలితకుమారి, శోభారాణి, రాధిక ఉన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ‘బేటీ బచావో–బేటీ పడావో’

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రామస్తులు, కిశోర బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా వెంబావి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణ, పోషణ వంటి అంశాలపై కిశోర బాలికలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. వెలిమినేడులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పారిజాత, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శివకుమార్, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, అండాలు, పద్మ, సునీత, ధనలక్ష్మి పాల్గొనగా.. వెంబావిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా, అంగన్‌వాడీ టీచర్ సునీత, హెచ్ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ సుజిత, ఏఎన్ఎం స్వరాజ్యం పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు : మండలంలోని ఎల్గలగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో సర్పంచ్ సురిగి చలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆడ పిల్లల సంఖ్య పెంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మ, అంగన్‌వాడీ కార్యకర్త నెల్లికంటి అన్నపూర్ణ, ఆశ కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



కట్టంగూర్ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



చండూరు: కస్తాల గ్రామంలో మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత



బట్లపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద



వెలిమినేడులో ప్రతిజ్ఞ చేస్తున్న కిశోర బాలికలు, గ్రామస్తులు

దరఖాస్తులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి



నార్కట్‌పల్లి: బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



మునుగోడు: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న చండూరు ఆర్డీఓ దామోదర్‌రావు

నార్కట్‌పల్లి: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ద్వారా వచ్చిన వివిధ దరఖాస్తులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం ఆయన ఎల్లారెడ్డిగూడెం, నార్కట్‌పల్లిలోని పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసి బీఎల్‌ఓలకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి వెంకయ్య, ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ పద్మ, ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

ప్రత్యేకాధికారి పరిశీలన..

మర్రిగూడ: నూతన ఓటర్ల నమోదుకు గాను మర్రిగూడ మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, మునుగోడు ఏడీఏ ఎల్లయ్య శనివారం మర్రిగూడ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. శ్రీనివాసులు, ఎంపీడీఓ జె. వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, ఆర్ఐ బషీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

మునుగోడు: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని చండూరు ఆర్డీఓ దామోదర్‌రావు బీఎల్ ఓలకు సూచించారు. మునుగోడు, గూడపూర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల్లో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. స్థానికంగా నివాసముండే వారికే ఓటరు నమోదుకు అవకాశం కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పు ఉంటే సరిచేయడంతో పాటు మృతిచెందిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎన్. నరేష్, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

శాలిగౌరారం: మండలంలోని గురుజాల గ్రామంలో వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుండా శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ జెల్లా దశరథ, అధ్యక్షుడు మారం వేణుగోపాల్‌రెడ్డి, ప్రతినిధులు బుడిగె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.